## విద్యుత్తు కేబుళ్ల వల్లే ప్రారంభించలేదు

సిటీబ్యూరో, మార్చి17,(నమస్తే తెలంగాణ): 'నమస్తే తెలంగాణ'లో సోమవారం ప్రచురించిన 'ఈఎన్‌టీ కొత్త భవనం ఎప్పుడు కట్టిస్తరు?' కథనానికి డైరెక్టర్ ఆఫ్ మెడికల్ హెల్త్ స్పందించింది. ఈ కథనానికి వివరణిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు. నిర్మాణపు పనులు చేపడుతున్న తరుణంలో, భూగర్భ తవ్వకాల సమయంలో ఈఎన్టీ ఆసుపత్రి, ట్రూప్ బజార్, కోఠి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా చేసే కేబుళ్లు భూగర్భంలో ఉండటంతో వాటికి నష్టం వాటిల్లుతుందని అసిఫ్‌నగర్ ఉపవిభాగం అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ నివేదికనిచ్చారు, ఈ నివేదిక ఆధారంగా టీజీఎస్పీడీసీఎల్ అధికారులు జేసీబీ వినియోగానికి బదులుగా చేతిపనితో తవ్వకాలు చేయాలని సూచించినట్లు తెలిపారు. త్వరలోనే పనులు చేపడుతామని అన్నారు.

## స్థలాభావం ఉన్నా చికిత్సనందిస్తున్నం

'నమస్తే తెలంగాణ' కథనానికి ఉస్మానియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వివరణ

సిటీబ్యూరో, మార్చి17, (నమస్తే తెలంగాణ): 'నమస్తే తెలంగాణ'లో ఉస్మానియా ఆసుపత్రిలో నెలకొన్న సమస్యల గురించి 'సర్కార్ నిర్లక్ష్యంతో రోగుల అవస్థలు', 'వసతుల లేమిలో ఉస్మానియా' అనే శీర్షిన సోమవారం ప్రచురితమైన రెండు కథనాలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాకేష్‌కుమార్ సహాయ్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. పాత భవనాన్ని మూసివేయడం వల్ల ఆసుపత్రిలో స్థలాభావం ఉన్నప్పటికీ, రోగులకు నాణ్యమైన చికిత్స కొనసాగిస్తున్నమని ఆయన వెల్లడించారు. రోగుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పుడు ఫ్లోర్ బెడ్స్ అవసరమవుతాయన్నారు. పేషెంట్ల అటెండర్ల కోసం ఆసుపత్రిలో మూడు వేటింగ్ హాళ్లు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ హాళ్లను ఉపయోగించుకునేలా రోగుల అటెండర్లను ప్రోత్సహిస్తున్నామని ఆయన తెలిపారు.

# ఓపీలో కనిపించని హెచ్‌ఓడీలు.. ప్రొఫెసర్లు..

**గాడితప్పుతున్న వైద్యవిద్య**
**ప్రైవేట్ ప్రాక్టీస్‌కే ప్రాధాన్యత**
**అసిస్టెంట్, పీజీల మీదనే ఓపీ భారం**
**సరైన వైద్యం అందక రోగుల ఇక్కట్లు**



సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): నగరంలోని పలు ప్రభుత్వ బోధన దవాఖానల్లో కొందరు హెచ్‌ఓడీలు, ప్రొఫెసర్ స్థాయి వైద్యులు ఓపీ సేవలకు దూరంగా ఉంటున్నారు. కొందరు ప్రొఫెసర్లు విభాగాలకే పరిమితమవగా మరికొంత మంది ప్రైవేటు ప్రాక్టీస్‌కు ప్రాధాన్యత ఇస్తూ తీరిగ్గా మధ్యాహ్నం సమయంలో వస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరికొందరు సొంత పనుల్లో నిమగ్నమై తమకు ఇష్టమొచ్చిన సమయంలో వచ్చి వెళ్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరైతే ఓపీ విధులకు హాజరైనా కూడా ఒక గంట లేదా రెండు గంటలు ఉండి మమ అనిపించుకుని వెళ్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఓపి భారమంతా పీజీలు, సీనియర్ రెసిడెన్స్‌లు, అసిస్టెంట్, అసోసియేట్‌లపైననే పడుతున్నట్లు సదరు వైద్యులు వాపోతున్నారు. ముఖ్యంగా ఉస్మానియా, గాంధీ, నిలోఫర్ తదితర దవాఖానల్లో ఈ పరిస్థితి నెలకొన్నట్లు తెలుస్తోంది.

### సరైన వైద్యం అందక..

అనుభవజ్ఞులైన ప్రొఫెసర్ స్థాయి వైద్యులు ఓపిలో అందుబాటులో లేకపోవడంతో, దూర ప్రాంతాల నుంచి వచ్చి, గంటల తరబడి ఓపి కోసం నిరీక్షించిన రోగులకు వైద్య విద్యార్థులే దిక్కవుతున్నారు. దీంతో కొన్ని రకాల దీర్ఘకాలిక వ్యాధులు, ముఖ్యంగా స్పెషాలిటీ విభాగాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలకు సరైన వైద్యం అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు.

### పీజీలపైనే భారం..

ప్రొఫెసర్ స్థాయి వైద్యులు ఓపిలో అందుబాటులో లేకపోవడంతో వందల సంఖ్యలో వచ్చే రోగుల భారమంతా పీజీల పైననే పడుతున్నట్లు తెలుస్తోంది. కొన్ని దవాఖానల్లో అయితే అసిస్టెంట్, అసోసియేట్ స్థాయి ప్రొఫెసర్లు కూడా ఓపి విధుల్లో సరిగ్గా ఉండకపోవడంతో మొత్తం భారం పీజీలు, ఎస్ఆర్‌లపైననే పడుతున్నట్లు కొందరు వైద్యవిద్యార్థులు ఆరోపిస్తున్నారు. ఉస్మానియా, గాంధీ, నిలోఫర్, కోటి ఈఎన్‌టి, పేట్లబుర్జ్ ప్రసూతి దవాఖానల్లో కొంత మంది ప్రొఫెసర్లు క్లాసెస్ పేరుతో మధ్యాహ్నం 2గంటలకే బయటకు వెళ్లిపోతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇక ఓపికి సైతం చాలా మంది ప్రొఫెసర్లు దూరంగా ఉంటున్నారని, కొంత మంది కేవలం డిపార్ట్‌మెంట్ రూమ్‌లకే పరిమితమవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో కూడా ఇదే అంశంపై అప్పటి ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు పలు మార్లు హెచ్‌ఒడిలు, ప్రొఫెసర్లును హెచ్చరించన సందర్భాలు ఉన్నాయి. ప్రొఫెసర్లు ఖచ్చితంగా ఓపిలో ఉండాలని లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని కూడా అప్పట్లో నాటి మంత్రి పదే పదే హెచ్చరికలు జారీచేసిన విషయం తెలిసిందే.

# సమస్యల పరిష్కారంలో జాప్యమొద్దు

**జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ అధికారులకు సూచన**
**జీహెచ్‌ఎంసీ పరిధిలో ప్రజావాణికి 165 అర్జీలు**



వినతులు స్వీకరిస్తున్న జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు

సిటీబ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ ) ప్రజావాణిలో వచ్చిన విన్నపాల పరిష్కారంలో జాప్యం చేయొద్దని జీహెచ్‌ఎంసీ అడిషనల్ కమిషనర్ శివకుమార్ నాయుడు అధికారులకు సూచించారు. సోమవారం జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు శివకుమార్ నాయుడు, వేణుగోపాల్, రఘు ప్రసాద్, చంద్రకాంత్ రెడ్డి, అడిషనల్ సీసీపీ గంగాధర్‌లు నగరం నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 85 విన్నపాలు రాగా ఆరు జోన్లలో 80 ఆర్జీలను స్వీకరించనట్లు అధికారులు పేర్కొన్నారు. ప్రజావాణి కార్యక్రమానికి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్ రెడ్డి, కమిషనర్ ఇలంబర్తి లేకపోవడంపట్ల అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

### ప్రజావాణికి 69 దరఖాస్తులు



దరఖాస్తులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, ముకుందరెడ్డి

సిటీ బ్యూరో, మార్చి 17 (నమస్తే తెలంగాణ): సమస్యల పరిష్కారం కోసమే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్లు కదిరివన్ పలని, డాక్టర్ ముకుందరెడ్డి అన్నారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరించారు. ప్రజల నుంచి 69 దరఖాస్తులు అందాయని వెల్లడించారు. అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ ఈ వెంకటాచారి, జిల్లా అధికారులు పవన్ కుమార్, సుబ్రహ్మణ్యం, సీపీఓ సురేందర్, రాజేందర్, శ్రీరామ్,రమేష్ పాల్గొన్నారు.

## హైడ్రా ప్రజావాణికి 59 ఫిర్యాదులు

సిటీబ్యూరో, మార్చి17(నమస్తే తెలంగాణ): ప్రభుత్వస్థలాలే కాకుండా రహదారులు, నాలాలు అనే తేడా లేకుండా ఏమాత్రం అవకాశం దొరికినా అడుగుజాగ కూడా వదలకుండా కబ్జాచేసి నిర్మాణాలు చేపడుతున్నారంటూ హైడ్రాకు పలువురు ఫిర్యాదు చేశారు. సోమవారం బుద్ధభవన్ లోని హైడ్రా కార్యాలయంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలనుంచి వివిధ అంశాలపై 59 ఫిర్యాదులందాయి. నాగిరెడ్డి గొలుసుకట్టు చెరువు ఎఫ్‌టిఎల్ పరిధితోపాటు బఫర్‌జోన్‌లో అక్రమకట్టడాలు వెలుస్తున్నాయని యాప్రాల్ జాయింట్ యాక్షన్ కమిటీ ఫిర్యాదు చేసింది. ఈ చెరువుకు రూ.1.2 కోట్లు ఖర్చు పెట్టి ప్రభుత్వం వేసిన ఫెన్సింగ్‌ను తొలగించి ప్రహరీ నిర్మిస్తున్నారని వెంటనే వాటిని తొలగించాలని కమిటీ హైడ్రాను కోరింది. హయత్‌నగర్ మున్సిపాలిటీ సర్కిల్3లోని వివేకానందనగర్ కాలనీ 25 ఫీట్ల రోడ్డును ఆక్రమించి ఇల్లు నిర్మిస్తున్నారని, గతంలో మున్సిపాలిటీ అధికారులు కూల్చేసినా మళ్లీ నిర్మిస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు. కెపిహెచ్‌బిలో ప్రధానరహదారికి ఆనుకుని ఉన్నసర్వీస్ రోడ్డును మొత్తం ఆక్రమించి చిరువ్యాపారుల పేరిట దందాలు చేస్తున్నారని, దీంతో తమకు ఇబ్బందిగా ఉందని కెపిహెచ్‌బి ఫేస్ 1,2 రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. వచ్చిన ఫిర్యాదులపై అక్కడికక్కడే సంబంధిత జోన్ అధికారులకు కేటాయించి త్వరలోనే పరిష్కరించాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు.

## మాజీ ఎమ్మెల్యే భిక్షమయ్యగౌడ్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు



ఆలేరు టౌన్, మార్చి 17 : పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు పంతం కృష్ణ, జింకల రామకృష్ణయాదవ్ సోమవారం మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్‌ను సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## చిన్నకొండూరులో పశు వైద్య శిబిరం



పశు వైద్య శిబిరంలో అవగాహన కల్పిస్తున్న పశు వైద్యులు

చౌటుప్పల్ రూరల్, మార్చి 17 : మండలంలోని చిన్నకొండూరు గ్రామంలో పీవీ నర్సింహారావు పశు వైద్య విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 350 పశువులకు గర్భకోశ వ్యాధి చికిత్సలు, చూడి పరీక్షలు చేశారు. నట్టల నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో మండల పశు వైద్యాధికారి పృథ్వీ, పశు వైద్యశాల శాస్త్రవేత్తలు డాక్టర్ వెంకటరమణ, కళ్యాణి, గోపాల్, విశ్వేశ్వర్, రమేశ్ పాల్గొన్నారు.

## ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండలాధ్యక్షుడిగా చాంద్‌పాషా



చాంద్‌పాషాకు నియామక పత్రం అందజేస్తున్న సంఘం జిల్లా కోశాధికారి ఉపేందర్

తుర్కపల్లి, మార్చి 17 : ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం మండల సమావేశాన్ని మండల కేంద్రంలో సంఘం జిల్లా కోశాధికారి ఉపేందర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా చాంద్‌పాషా మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా మహేశ్, ప్రధాన కార్యదర్శిగా ఇంద్రయ్య, కోశాధికారిగా మాధవి, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

## సోలిపేటలో చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రం ప్రారంభిస్తున్న ఎస్ఐ శ్రీశైలం

బొమ్మలరామారం, మార్చి 17 : మండలంలోని సోలిపేట గ్రామంలో మొలుగు బాలమణి, నర్సయ్య జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్ఐ శ్రీశైలం సోమవారం ప్రారంభించారు. కార్యక్రమలో మాజీ జడ్పీటీసీ చీర్ల రాజేశ్వర్, పోచంరెడ్డి, కిష్టయ్య, రాజు, నాగేందర్‌రెడ్డి, బాబు, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, అనిల్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు దంత పరీక్షలు



పాఠశాలలో విద్యార్థులకు దంత పరీక్షలు చేస్తున్న వైద్యులు

మోత్కూరు, మార్చి 17 : మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో నార్కట్‌పల్లి కామినేని వైద్యశాల వైద్యులు విద్యార్థులకు సోమవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. నోటి దుర్వాసన నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, పరిశుభ్రతకు పాటించాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు ప్రణవ్, కోమాళి, రుత్విక్, సాయినాథ్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.శ్యామల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఆశ వర్కర్ల ముందస్తు అరెస్టు



ఆశ వర్కర్లను ముందస్తుగా అరెస్టు చేసిన గుండాల పోలీసులు

గుండాల, మార్చి 17 : మండలంలోని ఆశ వర్కర్లను పోలీసులు సోమవారం ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ అసెంబ్లీ ముట్టడి నేపథ్యంలో వారు హైదరాబాద్‌కు వెళ్లకుండా అరెస్టు చేశారు.

## మాట కంటే పాట శక్తివంతమైంది..


డాక్టర్ సుద్దాల అశోక్ తేజ



బీజేఆర్ డిగ్రీ కాలేజీలో సుద్దాల అశోక్ తేజను సన్మానిస్తున్న రామలక్ష్మి

హిమాయత్ నగర్, మార్చి17: మాట కంటే పాట శక్తివంతమైనదని ప్రఖ్యాత గాయకుడు, రచయిత డాక్టర్ సుద్దాల అశోక్ తేజ అన్నారు. సోమవారం నారాయణ గూడలోని బీజేఆర్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో పాట రచన, గానం అనే అంశంపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాట పాట స్వరం వాణి బాణిలపై పదాల అల్లికయే కవితలైతే పదాల కదలికయే పాట అని అన్నారు. తాను రాసే ప్రతి పాట మావన జీవన విధానానికి అద్దం పట్టేలాగానే ఉంటుంద న్నారు. ఈ కార్యక్రమంలో కాలేజీ వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సత్య నారాయణరెడ్డి, డాక్టర్ రామలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ రాపోలు శ్రీనివాస్, సి.వి.ఎల్ నారాయణ, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ జె.గంగాధర్, డాక్టర్ హెచ్.శ్రీనివాస్, డాక్టర్ ఆదాము, భిక్షపతి, పండరినాథ్, నిర్మల, అరుణ, నాగరత్నమ్మ, ఎల్.జ్యోతి పాల్గొన్నారు.

## రజకుల జీవితాల్లో వెలుగులు నింపండి



మంత్రి ప్రభాకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న రజక రిజర్వేషన్ సమితి సభ్యులు

జవహర్‌నగర్, మార్చి 17: గతంలో కేటాయించిన 150 కోట్ల విద్యుత్ బకాయిలను వెంటనే ప్రభుత్వం విడుదల చేయాలని, రజక వృత్తిదారుల సంక్షేమం కోసం ఎలాంటి బ్యాంకు షరతులు లేకుండా రూ. 2లక్షల లోన్ ఇవ్వాలని కోరారు. 250 యూనిట్ల ఉచిత విద్యుత్ బకాయిలను చెల్లించాలని ప్రభుత్వ అధికారులు చేతివృత్తిదారులను ఇబ్బందులకు గురిచేయడం తగదని అన్నారు. ఈ మేరకు తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షుడు గోపి, ప్రధాన కార్యదర్శి కొలిపాక లక్ష్మణ్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని మంత్రుల నివాసంలో సోమవారం మంత్రి పొన్నం ప్రభాకర్‌కు వినతిప్రతం అందజేశారు. స్పందించిన మంత్రి విద్యుత్ బకాయిలు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంబరాజుకుమార్, శాగంటి వెంకటేష్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌లో తత్సారం

**జిల్లాలో మంజూరైనవి308 ఇండ్లు**
**పథకం ప్రారంభమై నెలలు దాటిన**
**65 ఇండ్లకే గ్రౌండింగ్**

మేడ్చల్, మార్చి17(నమస్తే తెలంగాణ): ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌లో తత్సారం చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో 308 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు అయ్యాయి. జనవరి 26న ఇందిరమ్మ పథకం ప్రారంభమై నెల పదిహేను రోజులు పూర్తయినప్పటికీ 65 ఇండ్లకు మాత్రమే గ్రౌండింగ్ పూర్తయ్యాయి. మిగతా 243 ఇందిరమ్మ ఇండ్లకు గ్రౌండింగ్ చేయాల్సి ఉంది. ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌పై అధికారుల నిర్లక్ష్యం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు సరైన అవగాహన కల్పించకపోవడం మూలంగానే ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌లో తత్సారం ఏర్పాడుతుంది. 4 వందల చదరపు అడుగుల ఖాళీ స్థలంలో లబ్ధిదారులు మార్క్‌అవుట్ చేసుకుంటేనే సంబంధిత అధికారులు లబ్ధిదారుడి ఫొటోలు యాప్‌లో నమోదు చేస్తే ఇంటి నిర్మాణంలో భాగంగా నాలుగు దశల్లో బిల్లులు చెల్లించనున్నారు.

### ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక మళ్లీ ఎప్పుడు?

ఇందిరమ్మ ఇండ్ల పథకానికి మళ్లీ లబ్ధిదారుల ఎంపిక ఎప్పుడు చేస్తారని లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలు ఉండగా మొదటి దశలో మేడ్చల్ నియోజకవర్గంలోని ఘట్‌కేసర్ మండలం ఘనపూర్‌లో 70, కీసర మండలం బోగారంలో 33, మేడ్చల్ మండలం సోమారంలో 24, మూడుచింతలపల్లి మండలం కేశవరంలో 101, శామీర్‌పేట మండలం పోన్నాలలో 80 లబ్ధిదారులతో కలిపి 308 మందికి ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వర్తింపజేశారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ పథకానికి 1, 42 లక్షల దరఖాస్తులు రాగా నియోజకవర్గానికి 3,500 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇంటి పథకాన్ని వర్తింపజేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిన అమలులో మాత్రం ఆలస్యం జరుగుతుందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలో ఉన్న జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలైన మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలలో ఇందిరమ్మ ఇంటి పథకానికి లబ్ధిదారుల ఎంపిక ఇప్పటి వరకు ప్రారంభం కాకాపోవడంతో దరఖాస్తుదారులు నిరుత్సాహానికి గురవుతున్నారు.

## ఎండల్లో హాయ్..హాయ్



ఎండలు మండుతుండడంతో చల్లని నీటిని అందించే కుండలు నగర దారుల్లో ఇలా కొలువుదీరాయి..

# పార్కింగ్ పరేషాన్

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వ జాగా ఉన్నా... అక్కడ పార్కింగ్ ఏర్పాటు చేయడం లేదు. ఇదే విషయాన్ని పలువురు కేబీఆర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కూడా ప్రస్తావిస్తూ.. ప్రభుత్వం పార్కు భూములకు ఇబ్బంది లేకుండా ప్రభుత్వ స్థలాల్లో పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేయడంపై దృష్టి పెట్టాలని సూచించారు. కానీ ప్రభుత్వం కేబీఆర్ పార్క్ వద్ద మల్టీ లెవల్ పార్కింగ్ పేరిట అత్యుత్సాహాన్ని ప్రదర్శిస్తూ... కేబీఆర్ పార్క్ స్థలాన్ని ఏజెన్సీకి పప్పు బెల్లంలా పంచిపెట్టేందుకు సిద్ధమైంది. అదేవిధంగా ఇప్పటికీ మెట్రో స్టేషన్ల వద్ద సరైన పార్కింగ్ యార్డు లేకపోవడంతో రోడ్లపైనే వాహనాలు నిలిపి ఉంచాల్సిన పరిస్థితి ఉంది.

### మల్టీ లెవల్ పార్కింగ్ యార్డులే పరిష్కారం..

నగరంలో ఉత్పన్నమవుతున్న పార్కింగ్ సమస్యపై శాస్త్రీయ పరిశీలన జరగడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా క్షేత్ర స్థాయిలో ఎదురవుతున్న పార్కింగ్ సమస్య పరిష్కారానికి బహుళ అంతస్తుల్లో పార్కింగ్ కాంప్లెక్సులను నిర్మిస్తే గానీ ఫలితం ఉండదని ఇప్పటికే పలువురు అర్బన్ ట్రాన్స్ పోర్టు నిపుణులు చేసిన అధ్యయనంలో తేలింది. ఇదే పెరుగుతున్న వాహనాలకు పార్కింగ్ విరుగుడుగా పనిచేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వమే ప్రస్తుతం ఉన్న వాహనాలు, వచ్చే పదేండ్ల తర్వాత నగరంలో పెరగబోయే వాహనాల సంఖ్యకు అనుగుణంగా పార్కింగ్ స్థలాల ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. కానీ గడిచిన ఏడాది కాలంగా నగరంలో విపరీతంగా పెరుగుతున్న ట్రాఫిక్ సమస్యలను పరిష్కారానికి ఇప్పటికీ ప్రభుత్వం దృష్టి పెట్టలేదు. కానీ ట్రాఫిక్ నియంత్రణపై వాహనదారులపై వేల రూపాయాల చలాన్లతో వేధిస్తున్నది. ఈ క్రమంలో ప్రభుత్వంలో పెద్ద ఎత్తున్న నగరంలో పార్కింగ్ యార్డులను నిర్మించేలా ప్రణాళికలను అమలు చేయాల్సిన అవసరం ఉంది. కనీసం ప్రతిపాదన దశలో ఉన్న పార్కింగ్ యార్డుల నిర్మాణానికి ప్రభుత్వ స్వప్రయోజనాలు మరిచి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని సిటీ జనాలు కోరుతున్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట : సీపీఎం

భూదాన్ పోచంపల్లి, మార్చి 17 : ప్రజా సమస్యల పరిష్కారానికి పోరుబాట కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి కోట రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని భీమనపల్లి గ్రామంలో సోమవారం డ్రైనేజీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ సమస్యను పరిష్కరించి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. పాత ఎస్సీ కాలనీలో రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు మంచాల మధు, భిక్షపతి, మల్లేశ్, లలిత, బూరమ్మ, ఇందిరమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

## 'రుణమాఫీ నిధులు విడుదల చేయాలి'




సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెక్క దయాకర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, మార్చి 17 : రైతు భరోసా, రుణమాఫీ నిధులను వెంటనే విడుదల చేయాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెక్క దయాకర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులకు పూర్తిచేసి సాగునీరు అందించాలన్నారు. 15 రోజులకోసారి పాల బిల్లులు చెల్లించాలని, అన్ని రకాల వడ్లకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం రైతు సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కంటె శ్రీశైలం, గౌరవాధ్యక్షుడిగా సుర్కంటి సాయిరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సంగం గణేశ్, మరో తొమ్మిది మంది ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, మండల కార్యదర్శి గోడల భూషణ్, పట్టణ కార్యదర్శి మిర్యాల కృష్ణమూర్తి, నాయకులు యాదయ్య, సుదర్శన్, బుచ్చిరెడ్డి, బాలయ్య, నర్సింహ, బాలనర్సింహ, సాయిలు పాల్గొన్నారు.

## విద్యార్థులకు దివీస్ స్కాలర్‌షిప్‌లు

చౌటుప్పల్, మార్చి 17 : మున్సిపాలిటీ పరిధిలోని లింగోజిగూడెం గ్రామంలో దివీస్ పరిశ్రమ కార్యాలయంలో మండల వ్యాప్తంగా ప్రతిభావంతులైన 50మంది విద్యార్థులకు కంపెనీ జనరల్ మేనేజర్ జి.బాలకిశోర్ రూ.7.93లక్షల స్కాలర్‌షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ముద్దం సుమిత్ర సత్తయ్య గౌడ్, బాతరాజు సత్యం, మద్దెల సందీప్, పరిశ్రమ ప్రతినిధులు వీరయ్య, కె.శివప్రసాద్, బి.గోపి, ఎస్.సాయికృష్ణ, వి.వంశీకృష్ణ పాల్గొన్నారు.